# నినాదం

తెలంగాణ ప్రాంతీయం — నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, 29 జూన్, 2025


## నర్సింగాయపల్లి ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు

### మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, జూన్ 28 (నినాదం న్యూస్) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని నర్సింగాయపల్లి గ్రామంలో శివాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 726 ద్వారా రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఈ నిధుల మంజూరికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఇన్చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిలిచిపోయిన ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేయాలి



**చెన్నూరు జూన్ 28 (నినాదం న్యూస్) :** చెన్నూరు పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిని పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు నిలిచిపోయిన ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేయాలని100 పడకల ఆసుపత్రి ని 70 పడకలుగా మార్చే కుట్ర జరుగుతుందని ఆరోపణ చేశారు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి చెన్నూర్ నియోజకవర్గంలో ఆగిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రాజ రమేష్ డిమాండ్ చేశారు.


## దాతల సహకారంతోనే పాఠశాల అభివృద్ధి

### మండల విద్యాధికారి పి.ఛత్రు నాయక్



**హుజూర్ నగర్, గరిడేపల్లి, జూన్ 28 (నినాదం న్యూస్) :** దాతల సహకారం తోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని మండల విద్యాధికారి పి.ఛ త్రు నాయక్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆశ్రీ ఫౌండేషన్ వారు స్టడీ చైర్స్ మరియు స్వెటర్ లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి చెందుతాయని విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి రావడా నికి దోహద పడతాయన్నారు.ఆశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 88 వేల రూపాయ లు విలువ చేసే 45 స్టడీ చైర్లు మరియు ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు 18000 విలువచేసే సెంటర్స్ అందించినట్లు తెలిపారు. దాతలు అందజేసిన వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దాతలను అభినందించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు ఉపయోగపడేటువంటి మెటీరియల్స్ అందిస్తున్నామని విద్యార్థులు మంచిగా చదువుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని నిర్వాహకులు కందుల ప్రపూర్ణ రామకృష్ణారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రజిత,ఉపాధ్యాయురాలు సునీత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు సునీత, కందుల కోటిరెడ్డి, నాగమ్మ, దాత కందుల వీరనారాయణ రెడ్డి, కస్తూరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో గ్రామ శాఖ నూతన కమిటీలు



**మల్హర్ జూన్ 28 (నినాదం న్యూస్) :** మంథని నియోజకవర్గం మలహర్ రావు మండలం కొయ్యూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్హర్ మండల్ పాక్స్ డైరెక్టర్ వొన్న తిరుపతి రావు ఆధ్వర్యంలో ఈరోజు కొయ్యూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు పోతిరెడ్డి మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుంటి రామచంద్రు,ప్రధాన కార్యదర్శ వేల్పుల వెంకటేష్, నియమించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లకావత్ సవేందర్,కొండా రాజమ్మ, కలిమోద్దీన్ వేల్పుల మహేందర్, కొండూరి మమతా, మల్ల రెడ్డి, బాపు రెడ్డి, కిషన్ గౌస్, ఎడ్ల రాము, తిరుపతి నాయక్, పంతకాని శేషి, వేల్పుల నారాయణ, మల్లేష్, రాజేందర్, ఉమేష్ పున్నం శివ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివశరణ్ రెడ్డి



**డోర్నకల్ / దంతాలపల్లి జూన్ 28 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివశరణ్ రెడ్డి ఈ రోజు హైదరాబాదులో దంతాలపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంపెట సురేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా యువ నాయకులతో ముక్తంగా సంభాషించిన శివశరణ్ రెడ్డి మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్తు.సమాజాన్ని మార్చే శక్తి యువతలోనే ఉంది.రాజకీయాల్లో యువత భాగస్వామ్యం అత్యంత అవసరం.స్థానిక సంస్థల ఎన్నికలపై యువత గమనాన్ని కేంద్రీకరించాలి. ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి యువజన కాంగ్రెస్ అనేక వేదికలను కల్పిస్తోంది.అని చెప్పారు.పార్టీ పట్ల నిబద్ధత కలిగిన,ప్రజాసేవ పట్ల అంకితభావం ఉన్న యువతకు కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు, సామాజిక న్యాయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని శివశరణ్ రెడ్డి స్పష్టం చేశారు.

## మత్తడి ఎత్తు పై వస్తున్న ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్ నేతలు

### ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు

**చెన్నూర్, జూన్ 28 (నినాదం న్యూస్) :** చెన్నూరు పట్టణ శివారులో లోని శనగకుంట చెరువు మత్తడికి ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. సుమారు నాలుగు లక్షల పదివేల రూపాయల ఓ&ఎం నిధులతో మత్తడికి శాశ్వత మరమ్మతులు చేపట్టారు ఈ సందర్భంగా గత కొద్ది రోజులుగా మత్తడి ఎత్తు విషయంలో వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ కాంగ్రెస్ నేతలు ఇరిగేషన్ అధికారులతో కలిసి మత్తడిని పరిశీలించారు మత్తడి నిర్మాణం లో ఎక్కడ కూడా అవకతవకలు జరగలేదని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సుశీల్ మాట్లాడుతూ గత సంవత్సరం శననగకుంట మత్తడి పేల్చివేత ఘటనలో కొందరు బిఆర్ఎస్ నేతలు, మరియు రియల్టర్లు మొత్తం 14 మంది నిందితులు జైలుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. మత్తడి ఎత్తు విషయంలో బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు ఎవరు కూడా నమ్మే పరిస్థితిలో లేరని హితవు పలికారు. మంత్రి వివేక్ చొరవతో పూర్తిగా ధ్వంసమైన మత్తడి నిర్మాణానికి శాశ్వత మరమ్మతులు చేపట్టేలా నిధులు కేటాయించారని పేర్కొన్నారు. మత్తడి ఎత్తు విషయంలో నిబంధనల ప్రకారమే నిర్మాణం జరుగుతుందని మంత్రి వివేక్ చేస్తున్న అభివృద్ధి పనులను ఓర్వలేక కొందరు బిఆర్ఎస్ నేతలు మంత్రి వివేక్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

### రాష్ట్ర ఆరోగ్య శాఖ అడిషనల్ సెక్రటరీ అయేషా మస్రత్ ఖానమ్






కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూన్ 28(నినాదం న్యూస్) : ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ అడిషనల్ సెక్రటరీ అయేషా మస్రత్ ఖానమ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలోని అంకుశాపూర్ లో గల ప్రభుత్వ వైద్య కళాశాలను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తో కలిసి సందర్శించి కళాశాలలోని గదులు, తరగతి గదులు పరిశీలన జరిపి విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు, విద్యా బోధన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ అడిషనల్ సెక్రటరీ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తున్నామని, త్వరలో వైద్య కళాశాలలో బోధన కొరకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తామని, ఒప్పంద పద్ధతిలో ల్యాబ్ టెక్నీషియన్ ఇతర సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల భవన పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయని, విద్యార్థులకు త్వరలో వసతి గృహాల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తూ వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తుందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల భవనం పూర్తి చేస ఒకే ప్రాంతంలో ఉండే విధంగా వైద్య విద్యార్థుల వసతి కొరకు వసతి గృహాన్ని త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి డయాలసిస్ కేంద్రం, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, అందుబాటులో ఉంటూ ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆసుపత్రిలోని నిర్మాణంలో ఉన్న భవనాల గదుల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పౌరాణిక చిత్రాల బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు

### నేడు కమలాకర్ కామేశ్వరరావు వర్ధంతి

తెలుగు సినిమా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కమలాకర కామేశ్వరరావు ది. పౌరాణిక సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ఆయనదే. తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో దైవ స్వరూపునిగా సుస్థిర స్థానం సంపాదించుకుని, పాత తరానికి చెందిన కొందరిచే చిత్ర పట పూజలు సైతం అందుకున్న ఎన్టీఆర్, పౌరాణిక హీరోగా వెలుగు వెలగడానికి కారణం కమలాకర కామేశ్వరరావు తీసిన సినిమాలే. తెలుగు పౌరాణిక చిత్రాలకు సాటి రాగల పౌరాణికాలు యావద్భారత దేశంలోనే మరే భాషలో లేవు. తెలుగు పౌరాణికాలకు ఆ ఘనతను సాధించి పెట్టిన చిత్రాలు చాలానే ఉన్నాయి. నర్తనశాల, పాండవ వనవాసం లాంటివి ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా మిగిలి పోయాయి. వాస్తవానికి తెలుగు ప్రేక్షకులకు తన సినిమాలతో భక్తి మార్గం పట్టించిన ఘనుడాయన. ఆయన తీసిన సినిమాలు.. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం. కమలాకర కామేశ్వరావు 1911 అక్టోబర్ 4న మచిలీపట్నంలో జన్మించారు. అక్కడే బి.ఎ పూర్తి చేశారు. మొదట్లో కృష్ణా పత్రికలో 'సినీఫాన్' అన్న పేరుతో సినిమా రివ్యూలు వ్రాసే వారు. విడుదలైన తెలుగు సినిమాలనుబీ న్యూ థియేటర్స్, ప్రభాత్ వారి హిందీ సినిమాలనూ కూలంకషంగా పరిశీలిస్తూ నిశితంగా విమర్శించేవారు. సినిమాల్లో కథ, కథాసంవిధానం ఎలా వున్నాయి? ఆ సినిమాలు టెక్నికల్ గా ఎలా వున్నాయి? అన్న విషయాల మీద ఆయన విమర్శలు సాగేవి. తెలుగు, హిందీ సినిమాలే గాక ఆంగ్ల చిత్రాల గురించి కూడా వ్రాసేవారు.1931లో నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బుక్ రాసిన 'గుడ్ ఎర్త్' నవలను 1937లో సిడ్నీ ఫ్రాంక్లిన్ దర్శకత్వంలో ఇర్వింగ్ తాల్ బర్గ్ సినిమాగా నిర్మించగా, అందులో పాల్‌ముని, లూసీ రైనర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆస్కార్‌ను గెలుచుకుంది. ఈ సినిమా గురించి కమలాకర నాలుగు వారాలు సమీక్షలు రాశారు. నిశిత దృష్టితో రాసిన ఆ సమీక్షలు పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి.

ఆయన సినిమా విమర్శలకు ఎంతో విలువ ఉండేది. ఆ విమర్శలు విజ్ఞులందరికీ ప్రామాణికంగా ఉండేవి. ఆ విమర్శల్ని చదివి, వాటిలో 'బాగుంది' అని వ్రాస్తేనే ఆ సినిమాలను చూసేవాళ్ళు, బాగలేదని వ్రాస్తే చూడని వాళ్ళు కూడా ఉండేవారు. ఆయాన విమర్శలను నార్ల వెంకటేశ్వరరావు, గూడవల్లి రామబ్రహ్మం లాంటి ప్రముఖులందరూ ప్రశంసించారు. 'వస్త్రాపహరణం', 'మానసంరక్షణం' చిత్రాల మీద వ్రాసిన విమర్శలే కామేశ్వర రావును సినిమా రంగంలోకి అడుగులు వేసేలా చేశాయి. 1936లో ఆయన సినిమాల మీదున్న మక్కువతో మద్రాస్ చేరారు. స్క్రిప్ట్ మీదున్న పట్టువల్ల. మొదట్లో రచయితగా పని చేశారు. అదే సమయంలోనే కె.వి. రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆయనతో కలిసి అనేక సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు. వాహినీ వారి దేవత చిత్రం నుంచి కామేశ్వరరావు అసోసియేట్ గా పనిచేశారు. ఆసియాలోకెల్లా అతిపెద్ద స్టూడియోగా పేరుపొందిన వాహినీ స్టూడియోకు శంకుస్థాపన జరిగినప్పుడు మట్టి వేసిన వారిలో కామేశ్వరరావు ఒకరు. బందరులో కామేశ్వరరావుకు పింగళి నాగేంద్రరావుతో ఉన్న పరిచయంతో, కామేశ్వరరావు ఆయనను కె.వి.రెడ్డికి, బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. అలా తెలుగు సినిమా చరిత్రలో అత్యంత ప్రతిభా వంతమైన రచయితను పరిశ్రమకు పరిచయం చేసింది కూడా కామేశ్వరరావే.



కమలాకర కామేశ్వరావు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'చంద్రహారం'. ఇది జానపద సినిమాగా తెరకెక్కింది. ఇదే సినిమాను తమిళ వెర్షన్‌లో కూడా చేశారు.ఆ తర్వాత తీసిన 'పెంకి పెళ్లాం' సినిమా చేశారు. ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహాత్మ్యం' అనే పౌరాణిక సినిమా చేసిన కామేశ్వరరావుకు ఊహించని పేరు వచ్చింది. ఈ సినిమా అప్పటి వరకు గ్లామర్ హీరోగా వెలిగిన ఎన్టీఆర్ ఈ సినిమాలో మరో కోణంలో చూపించి సక్సెస్ అందుకున్నారు. తర్వాత వరుసగా 'శోభ', 'రేచుక్క పగటి చుక్క', 'మహాకవి కాళిదాసు' 'మహామంత్రి తిమ్మరుసు' లాంటి సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చి హిట్స్ అందుకున్నాయి. 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు కామేశ్వరరావు. 1962లో వచ్చిన 'గుండమ్మకథ', 'మహమంత్రి తిమ్మరుసు' వంటి వరుస సక్సెస్‌లతో బాక్సాఫిస్ దగ్గర కామేశ్వరావు పేరు మారుమ్రోగి పోయింది. 'గుండమ్మ కథ' సినిమా కుటుంబ కథా చిత్రంగా కామేశ్వరరావుకు మంచి పేరు తెచ్చుకుంది. కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన మరో హిట్ మూవీ 'నర్తనశాల'. ఈ సినిమాతోనే ఎస్.వి.రంగారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ నటుడిగా ఎస్వీఆర్ అవార్డు అందుకున్నారు. అంతకు ముందు కమలాకర దర్శకత్వంలో వచ్చిన 'పాండవ వనవాసం' సినిమా కూడా కామేశ్వరరావుకు మంచి పేరు తీసుకొచ్చింది. పౌరాణిక సినిమాల్లో అదే ఆయన ఫస్ట్ మూవీ. ఆ తర్వాత 'శకుంతల', 'శ్రీకృష్ణ తులాభారం', 'కాంభోజరాజు కథ', 'శ్రీకృష్ణావతారం', 'కలిసిన మనసులు', 'వీరాంజనేయ' లాంటి సూపర్ హిట్ సినిమాలు దర్శకుడిగా ఆయన ఖ్యాతిని పెంచాయి.

పౌరాణికాల మీదున్న పట్టుతో 1972లో కామేశ్వరరావు పిల్లలతో 'బాల భారతం' సినిమా తీసి ప్రేక్షకులను మెప్పించారు. 1970 ద్వితీయార్థానికి తెలుగులో పౌరాణికాలకు ఆదరణ పెరిగింది. ఒక రకంగా ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా ఒక వెలుగు వెలగడంలో కమలకర కామేశ్వరరావు తీసిన సినిమాలే కీ రోల్ పోషించాయి. రామారావు కూడా కమలకర కామేశ్వరరావును తన గురువుగా భావించేవారు. 'కురుక్షేత్రం', అంతగా విజయవంతం కాకున్నా, తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ వనవాసం', 'వినాయక విజయం', 'వాసవీ కన్యకా పరమేశ్వరి మహాత్మ్యం', 'సంతోషిమాత వ్రత మహాత్మ్యం', 'శ్రీదత్త దర్శనం', 'అష్టలక్ష్మి వైభవం', 'ఏడుకొండల స్వామి' లాంటి పౌరాణిక సినిమాలెన్నో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచాయి. దర్శకుడిగా కమలాకర కామేశ్వరరావు పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, సాంఘిక సినిమాలు చేసినా.. ఆయనకు పేరు సంపాదించి పెట్టినవి మాత్రం పౌరాణికాలే. అందుకే ఆయన్ని అందరు తెలుగు వెండితెర పౌరాణిక బ్రహ్మగా కీర్తిస్తారు. ఎన్నో అపురూపమైన చిత్రాలలో ప్రేక్షకుల మనసు దోచుకున్న కామేశ్వర రావు 1998 జూన్ 29న కన్ను మూశారు. గ్లాస్గో పంచె, తెల్లని మల్లెపూల వంటి జబ్బా, నెరసిన జుట్టు, నుదుట కుంకుమ బొట్టు... జీవితంలో ప్యాంటు వేయని మూర్తీభవించిన తెలుగుదనానికి ప్రతీకగా నిలిచిన కమలాకర కామేశ్వరరావు మన మధ్య లేకపోయినా. ఆయన సినిమాలతో ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరంజీవిగా నిలిచే ఉన్నారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## ప్రేమానుబంధాలు తీరు మారేనా!



మన నేటి సమాజంలో రోజులు గడిచేకొద్దీ ఎన్నో మార్పులు జరుగుతున్నాయి.ఆ మార్పులకు అనుగుణంగా మనుషులు మారుతు జీవితాలను గడిపేస్తున్నారు.కానీ ఇందులో గమనించాల్సిన విషయం మార్పు అనేది మానవ సంబంధాలు, కుటుంబ విలువలు మరియు వ్యక్తిగత జీవితాలపై ఏమేర ప్రభావం చూపుతుంది అనేది చాలా ముఖ్యం.నేటి ప్రస్తుత కాలంలో ప్రతి ఒకరిపై అతి తీవ్రంగా ప్రభావం చూపుతున్నా వాటిలో ప్రధానమైనది ఇంటర్నేట్.ఈ ఇంటర్ నెట్ అనేది అనేక విధాలుగా ఫేస్బుక్, వాట్సాప్, ఇన్ స్టా గ్రామ్ ఇలా వివిధ రూపాల్లో మన ముందు ఉంది.దీనినే సోషల్ మీడియా అని గొప్పగా పిలుస్తారు.నేటి ప్రస్తుత కాలంలో ఇంటర్ నెట్ మోసాలకు బలి అవుతున్నా అమాయకులు ఉన్నారు. మరియు మరికొందరు దానిని ఆసరాగా చేసుకుని వింత కోరికలతో కుటుంబ విలువలను తుంగలో తొక్కి ఊహకందని ఊహల లోకంలో విహరిస్తున్నా వారు ఉన్నారు. ఏడు అడుగులు నడిచి ఒక జీవితాన్ని అందించిన వ్యక్తులను సైతం మట్టుపెట్టే దారుణమైన పరిస్థితులు దాపరించాయి. జన్మనిచ్చి తమ ప్రాణంగా చూసుకున్నా తల్లితండ్రులను సైతం మృత్యువు చెరలోకి సాగనంపే ఉన్మాదం నెలకొంది.సోషల్ మీడియాకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోగా, మానవ సంబంధాలను,ఎంతో గొప్పనైనా కుటుంబ విలువలను మంటకలుపుతున్నా సంఘటనాలు మనం చూస్తూనే ఉన్నాం.ముఖ్యంగా కొన్ని సంఘటనలు చూస్తే సభ్యసమాజం తల దించుకునే పరిస్థితి దాపురించింది. ఒకప్పుడు యువతపై ప్రభావం చూపిన అంతర్జాలం నేడు హద్దులు దాటి కుటుంబం,పిల్లలు, కుటుంబ బాధ్యతలు ఉన్న కొందరి వివాహితులను సైతం ప్రభావితం చేసింది.ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటనాలు నివ్వెరపోయెలా ఉన్నాయి. ఫేస్బుక్ లో అపరిచిత వ్యక్తులతో పరిచయం వివాహేతర సంబంధంగా మారి కట్టుకున్నా భర్తలను మరియు కన్న పిల్లలను సైతం చంపడం మరియు పరిచయం అయిన వ్యక్తితో అవసరాలను తీర్చుకున్నాక అదే వ్యక్తిని మట్టు పెట్టడం అనేది సమాజం, కుటుంబ విలువలు తీరు దారి తప్పాయాని మేధావులు అభిప్రాయ పడుతున్నారు.వివాహం అయినా తరువాత భర్త అనే వాడు సంపాదన, ఉద్యోగం, కుటుంబ భారం, ఖర్చులు, పిల్లలు ఇలా ఎన్నో బాధ్యతలతో సతమతవుతుంటాడు.కానీ తనతో జీవితం పంచుకోవడానికి వచ్చి అన్ని తనే అని చెప్పి చివరికి కడతెర్చే పరిస్థితికి కారణాలు ఏంటి అని ఆలోచించాల్సిన అవసరం నేడు దాపురించింది. ముఖ్యంగా పెళ్లి అయిన కొందరు ఆడవాళ్లు కూడా వారి అవసరాలకు అనుగుణంగా నేటి కాలంలో సోషల్ మీడియా వినియోగంలో ముందున్నారు. సోషల్ మీడియా కానీ ఇంటర్ నెట్ కానీ వినియోగించడం తప్పు అని ఎవరూ అనట్లేదు. కాకపోతే దానిని వినియోగించే తీరు మారాలి. అందుబాటులో ఉందికదా అని హద్దుల దాటి మానవతా విలువలను, కుటుంబ బాధ్యతలను పాతరేస్తూ ఎంతో గొప్ప జీవితాలను నాశనం చేసుకోకుండా చూసుకోవాలి.కుటుంబం, పిల్లలు, బాధ్యతలు,సమాజం, ఇలా ఎన్నో హద్దులు ఉన్న వాటిని దాటుకుని కొందరి వివాహిత స్త్రీల ఆగడాల సంఘటనలు ఒకరకంగా భయాన్ని తలపించేలా ఉన్నాయి అనడంలో సందేహం లేదు.కుటుంబంలో భార్యాభర్తల మధ్య సఖ్యత, అన్యోన్యత ఉండేలా చూసుకోవాలి.వీలైనంత ఎక్కువ సమయం కుటుంబంతో గడిపేలా చూసుకోవాలి.ఏది ఏమి అయినా మానవ సమాజంలో బ్రతుకుతున్నామనే ఆలోచనను మరిచిపోకూడాదు.మనిషిగా మన దగ్గర ప్రేమ, అనురాగం,ఆపాయ్యత, అనే గొప్ప విలువలతో పాటు ఉన్నతమైన చదువు సంస్కారం ఉన్నాయి.కానీ నేడు అలాంటి వాళ్లలో చాలా మంది సోషల్ మీడియా వేదికగా వింత కోరికలతో కుటుంబాలను నాశనం చేసుకోవడం బాధాకరం. సాంకేతికత, విజ్ఞానం రోజులు మారే కొద్దీ పెరుగుతూనే ఉంటుంది.అది కేవలం మనం జీవితంలో ఉన్నత స్థాయి చేరడానికి తప్ప మనిషి మూలాలను మరిచి వికృత చెష్టలతో కాలం వృథా చేయడానికి కాదని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.



**వంశీకృష్ణ గౌడ్.బండి**
**సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం**
**రాష్ట్ర యూత్ కార్యదర్శి**
**జయశంకర్ జిల్లా**
**9550837962**

## దేశాభివృద్ధికి ఊతమిస్తున్న గణాంక శాస్త్రం

### (నేడు "జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవం" )

భారతీయ ప్రఖ్యాత గణాంకశాస్త్ర పరిశోధకులు, నిపుణులు అయిన ఆచార్య ప్రశాంత చంద్ర మహలనోబిస్ జన్మదినం 29 జూన్ సందర్భంగా ప్రతి ఏట భారత దేశవ్యాప్తంగా "జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవం (నేషనల్ స్టాటిస్టిక్స్ డే)" నిర్వహించడం 2007 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ పాలసీల రూపకల్పన, ప్రణాళికలు వేయడం, అభివృద్ధికి ఊతం ఇవ్వడంలో గణాంకశాస్త్ర ప్రయోజనాలను రుజువు చేసిన మహా ఘనుడిగా ఆచార్య ప్రశాంత చంద్ర మహలనోబిస్‌కు ప్రత్యేక పేరు ఉంది. 29 జూన్ 1893న కొల్‌కతాలో జన్మించిన ప్రశాంత చంద్ర మహలనోబిస్ గణాంకశాస్త్ర పరిశోధకుడిగా ప్రపంచ ఖ్యాతిని గడించాడు. భారత ప్రభుత్వం చేపట్టిన పంచవర్ష ప్రణాళికల రూపకల్పనతో పాటు దాని అమలులో గణాంకాల ప్రాధాన్యాన్ని రుజువు చేస్తూ ఆచార్య ప్రశాంత చంద్ర మహలనోబిస్ చేసిన సేవలకు జవహర్‌లాల్ నెహ్రూ సహితం మంత్రముగ్దుడు కావడం ఆశ్చర్యకరం.

**జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవం-2025**

2025 జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవం ఇతివృత్తంగా "నిర్ణయాలు చేయడంలో గణాంకాల ఉపయోగం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం వల్ల ప్రభుత్వ పాలన, పాలసీలు చేయడం, అభివృద్ధికి తోడవడం జరుగుతోంది. ఆచార్య ప్రశాంత చంద్ర మహలనోబిస్ చొరవతో 1931లో "ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించడంతో పాటు తర్వాత నేషనల్ సాంపుల్ సర్వే సంస్థను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవం వేదికగా సెమినార్లు, కార్యశాలలు, చర్చలు, ఉపన్యాసాలు, క్విజ్‌లు, వ్యాస రచన పోటీలను నిర్వహిస్తూ యువతను, గణాంకశాస్త్ర ప్రొఫెషనల్స్‌ను గణాంకశాస్త్రం వైపు ఆకర్షించడం జరుగుతుంది. నేడు గణాంకశాస్త్రాన్ని ఉపయోగిస్తూ వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, విద్య, పర్యావరణం, ఆర్థిక రంగాల్లో ప్రగతి నమోదు చేసుకోవడం పరిపాటి అయ్యింది. భారత ఆధునిక గణాంకశాస్త్రానికి పునాదులు వేసిన ఆచార్య ప్రశాంత చంద్ర మహలనోబిస్ సేవలను గుర్తు చేసుకోవడం మన కనీస కర్తవ్యం. నేటి డిజిటల్ యుగంలో గణాంకాల ప్రయోజనం వెలకట్టలేనిది. దేశ సామాజిక ఆర్థిక ప్రగతిలో గణాంకశాస్త్ర పాత్రను గమనిస్తూ "డాటాను ఒక కొత్త తైలం (డాటా ఈజ్ ఏ న్యూ ఆయిల్)"గా భావిస్తూ, పారదర్శక సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేయాలి. దేశ సుస్థిరాభివృద్ధిలో గణాంకశాస్త్ర అనువర్తనాలను ప్రయోగించాలి.

**- డా: మధుసూదన్ రెడ్డి బుర్ర,**
**9949700037**